సంసారాలు ఇలా ఉన్నంతకాలం బ్రతుకు చాలా భారమైపోతుంది తెచ్చేవాడికి. దమ్మిడీ సంపాదన లేకపోయినా దండిగా సంతర్పణలు చెయ్యాలనీ, ఉద్యోగం ఉంటుందా, ఊడుతుందా అన్న స్థితిలో ఉన్నా ఆడకూతురుని సవారీమీద అత్తింటినుంచి తీసుకురావాలనీ, అవస్థలెక్కువగా ఉన్నా అచ్చట్లూ, ముచ్చట్లూ తీరక తప్పదనీ పట్టుబట్టేవారు (ఆడవారైనా, మగవారైనా) ఆ సంసారానికి చేటే!

ఇవన్నీ లోకంలో తలెత్తుకు తిరగటానికి చేస్తున్నామంటారు, చాలమంది. కాని లోకం కోసం చెయ్యటం నిజమే. అయితే అలా చెయ్య కూడదు. ప్రజలు ఏమనుకుంటారోనని ఎవరూ ఏ పనీ చెయ్యనక్కరలేదు. లోకం దేనికేనా వంకలు పెడుతుంది. కాని కష్టంవస్తే ఆదుకునే వాళ్లు ఒక్కళ్లులేరు ఈ లోకంలో. పెట్టినంత కాలం తింటారు. తరువాత వేళాకోళం చేస్తారు. తిన్న యింటి వాసాలు లెక్కపెడతారు.

బాగా స్థితిమంతుడొకాయన ఉండేవాడు. ఆయన ఉచ్ఛదశలోఉన్న రోజుల్లో ప్రతిచిన్న విషయానికీ దూరతీరాల్లోఉన్న బంధువులను మిత్రులను కూడా పిలవనివిందు ఒక్కటీ ఉండేది కాదు. అయన కొడుకు ఫస్టుఫారం ప్యాసయితే, వాళ్ళమ్మాయికి మాటలువస్తే ఆయనచేసిన విందులకి ఒక్కొక్కదానికి కనీసం వందలకొద్దీ హాజరయి ఉంటారు. అంత వైభవంగా రోజులు గడిపిన ఆయనకు కూడా అవసానదశలో రోజువెళ్ళటం కష్టమయిపోయింది. ఎప్పుడూ సత్రంలా ఉండే ఆ ఇంటికి వచ్చేవారు ఒక్కరు లేకపోయారు. ఇప్పుడువస్తే ఆయనకు అసరా కావలసి వస్తుందని అందరికీ భయమే. చాలా సంవత్సరాలు ఆయన ఉప్పూ, పులుసూ తిన్న ఒకాయనతో ఈ విషయమై ముచ్చటిస్తే "ఆఁ! ఇవాళ అతనని లాభం ఏమిటండీ? కానిరోజు లొచ్చి పడ్డాయి. ఎవరు ఎవరికి సహాయం చెయ్యగలరు చెప్పండి? గడ్డు రోజులాయిరి! అయినా, ఉన్నప్పుడు మరీ అంత మన్నూ మిన్నూ తెలియకుండా మసులు కోవటం దేనికి? ఇవాళ నలుగురినీ ఆడిపోసు కుంటే మాత్రం ఎవరేం చేస్తారు? ఈయనగారి పెట్టుపోతలకి ఎవడు ఆశించాడు? ఈయన పెట్టు వల్లే మా జీవితాలు వెళ్ళాయా? ఏదో ఆయన పిచ్చిగాని... వేడుకకి రమ్మంటే వచ్చాముగదా అని తిన్నవాడొక్కడూ చెయ్యలేదంటే మేము ఏంచెయ్యగలం?" అన్నాడు. ప్రపంచంతీరువ అది.

కాని ఆయన మాటలు కూడా పూర్తిగా కాదనేందుకు లేదు. అందుకనే అన్నింటినీ "ఇది తప్పదు గదా!" అనుకోవటంకన్న నిజంగా తప్పనిదేదో తప్పేదేదో ముందు జాగ్రత్తగా ఆలోచించి చేస్తే చాల మంచిది—తరువాత "అయ్యో!" అని బాధపడటంకన్న.

# పంతగాడి ప్రాణాలు

దుత్తా దుర్గాప్రసాద్

తలచుకొంటే, 'సిల్లీ'గా వున్నా, ఆజన్మాంతం మరచిపోలేని సంఘటనలు ప్రతిఒక్కడి జీవితంలోనూ (ముఖ్యంగా బాల్యంలో) ఉంటాయ్.

ఓమారు వాటర్ సప్లై (18") పైపు రోడ్డు పక్కన పడేసి ఉన్నాయ్. "అందులోంచి దూరగలవా?" అన్నాడు మదన. "తప్పకుండా!" నన్నాను. "అయితే కానియ్, అర్ధణా పందెం" అన్నాడు. ఒళ్ళంతా కుదించుకొని చల్లగా దూరాను. మధ్యవరకూ సులభంగానే పోయాగాని అక్కడెందుకో మోకాళ్ళు రెండూ బిర్రుగా పట్టేశాయ్! గట్టిగా లాగినా రాలా! ఇక బయటికి రాలేనేమో ననిపించేప్పటికి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. "అమ్మో"అని పెద్దగా అరిచా! అరుపుకి గొట్టం పగులైందో లేక నా కాళ్ళే వెనక్కెళ్ళాయో గాని ఒక్క వూపులో బయటు పడ్డా! ఆనాటినుంచి ఆ గొట్టాల్ని చూచానంటే వళ్ళు జలదరిస్తుంది.

మా వూళ్ళోనే, ఓ శెట్టిగారు మూడంతస్తుల

మేడ కట్టించి, మూడు భాగాలు చేసి ముగ్గురు కొడుకులకీ పంచిపెట్టాడు. అలా ఆ భాగాలు అంతటితో ఆపకుండా, కొట్టుకు చస్తారేమో అని భయంతో, ఆఖరు అంతస్తుమీద కూడా, నాలుగైదడుగుల ఎత్తున గోడలు కట్టించాడు, ఒకరి వైపు నీళ్ళయినా మరొకరివైపునకు రాకుండా! అంటే అదే ఎత్తుగోడలు, పిట్టగోడల్తో సహా అయివున్నయ్ ఆ మేడపైన. ఓమారు, అనుకోకుండా "మనం" చిట్టచివరికి పోవాలిసొచ్చింది. అక్కడకు పోతేమాత్రం వీడు ఊరుకొనే ఘటు మైతేగా! "ఒరేయ్, కాళ్ళు తగలకుండా ఒంటి చేయి ఆనించి, సగం ఎత్తు లేచేటప్పటికి బుర్రలో పురుగు "అలా చూడరా" అంది. యింకేముంది. చీమల బారుల్లా నడుస్తున్న మనుషులూ గోళి క్కాయల్లా దొర్లుతున్న కార్లూ, కనిపించాయ్! కళ్ళు రెండూ రైలు చక్రాల్లా తిరిగేటప్పటికి, నేలకంటుకు పోయాడు. అయితే ఆ 'పద్దం' యివతల పడకట్టి సరిపోయిందిగాని లేకపోతే సున్నంలోకి ఎముకలు మిగిలేవేనా?

* * *

ఇదంత భయంకరంగా ఉండకపోవచ్చుగాని, తమాషాగా ఉంటుంది. ఆరోజుల్లో, అంటే "గోళ్ళు"మొలేస్తే, డబ్బులు కాస్తాయనుకొనేటప్పుడు, నేనూ, మదనా, సుబ్బిశెట్టీ, ఒక జట్టు. ఆ శెట్టిగారి కొట్లో బీడీలమీదికిపోయింది మా దృష్టి. బీడీలమీద ఓ పెద్ద ఉపన్యాసమిచ్చాడు వైశ్యాగ్రణి. రోజుకొక బీడీ చొప్పున తాగితే చాలా ఆరోగ్యమనీ; అసలు వాళ్ళనాన్న అంత లావున "మర్రిమాను"లా ఉంటానికి కారణం ఆ బీడీలేననీ, ప్రపంచంలో గొప్పవాళ్ళంతా అంటే, పంతులుగారు మొదలుకొని పాలేరు "పాపడి"వరకూ బీడీలు తాగేవాళ్ళేననీ, ఏమేమో చెప్పాడు. మా కెందుకో నమ్మాలనిపించింది. తక్షణం రహస్య సమావేశం జరిపి సాయంకాలానికి ప్రోగ్రామ్ వేశాము. ...అనుకొన్న ప్రకారం అయిదింటికే ఊరికవతల ఏటివొడ్డున "పొగాకు బేరన్ల"చాటున చేరాం. కట్టతీశాడు శెట్టి. ఒకదానిమీద ఒకటి వెలిగించి పారేస్తూ, ఎలా కాల్చాలో చెప్పబోతున్నాడు. మదనకూడా త్వరత్వరగా వెలిగించి, నాలుగుదమ్ములు లాగి అవతలపారేసి మరోటి అందుకొన్నాడు. అలాంటప్పుడు చూస్తూ ఊరుకొంటే మరో అవకాశం రాదని, నేనూ వెలిగించాను. ముక్కుతో పొగ వదుల్తున్నాడు సుబ్బిశెట్టి. మదనకూడా కాసేపు ప్రాక్టీసు చేసి, కళ్ళవెంట నీళ్లుతిరిగినా, బిగపట్టుకొని చల్లగా వదిలాడు ఏడుపుముఖంతో. సరే! నేనేనా అంత తీసిపారేసినవాణ్ణి! "ఎలా?" అని అడిగాను శెట్టిని "నోటితో పొగపట్టుకొని, గొంతుబిగించి, ముక్కుతో గాలి వదిలేయ్" అన్నాడు అలాగేనని, గట్టిగా లాగేటప్పటికి సగంబీడీ అయిపోయింది. పొగ ముక్కులోకి రాకముందే దమ్ము అయిపోయింది కాబోలు, వదిలేలోగానే అర బీడీపొగా, అమాంతం కడుపులో కెళ్ళింది. ఉక్కిరిబిక్కిరైపోయాను. ఒకటే దగ్గు, కళ్ళనిండా నీళ్లు మెలికలు తిరిగిపోయి పేగులు బయటికొచ్చేలా దగ్గుతూ కిందపడిపోయాను. నే పడిపోయేటప్పటికి వాళ్ళకి భయమేసింది కాబోలు, అంతులేకుండా పరుగు లంకించుకొన్నారు! అప్పటికి మసక మసకగా ఉంది. సరిగ్గా లేవలేకపోతూన్నా! చుట్టూ "స్మశానాలు!" గుండెలమీద టన్నుబరువు దభీమని పడ్డట్టనిపించింది, ఆ గోరీలన్నీ చూసేటప్పటకి! ఒక్క ఊపున లేచి పరుగు లంకించుకొన్నా ఎక్కడా ఆగకుండా. దారిలో ప్రతిచెట్టూ తల విరబోసుకొన్న దెయ్యంలా కనిపించింది! ప్రతిగడ్డివామూ, ఓ దెయ్యాల కొంపేమో ననిపించింది! ప్రతి తాటిచెట్టూ ఓ కొరివి దెయ్యంలా నవ్వింది! ఇల్లు చేరేటప్పటికి మూడుబిందెల నీళ్ళుపోసుకొన్నంత చెమటా, డీసెలుబళ్లు చేసేంత "గుండె మోతా," ఎన్నిముళ్ళు విరిగాయో, కాళ్ళంతా రక్తమూ...పదిహేను రోజులదాకా నోట్లోనే ఉంది ధర్మామీటరు. ఆనాటినుంచి బీడీలన్నా అవి తాగేవాళ్ళన్నా తాటిచెట్లూ, గడ్డివాములూ గుర్తుకొస్తాయ్.

...ఇలాగే బలపంముక్కకోసం మిద్దెమీదినుంచే దూకడం, పందెంపెట్టుకొని రైలు నల్భై అడుగుల్లో ఉండగా పట్టాలు దాటడం; కృష్ణలో కాలుజారి కడివెడునీళ్లు కడుపు పగిలేలా త్రాగటం; సీమచింతచెట్టెక్కి దిగడానికి దారి తెలియక అలాగే కూచుని అరగంటసేపు ఓపిగ్గా ఏడవటం, ఎన్నో!